# జెన్ జీరో ఇంక్

- నిర్మలాదిత్య



## నాంది

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మధనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత -

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

*(జరిగిన కథ: లక్ష్మి నెలకొల్పిన జెన్ జీరో ఇంక్ కంపెనీ లో పనిచేస్తున్న ఆయషా ,తన పనిలో 20% సమయం, కంపెనీకి ఎటువంటి ఆదాయం రాని పనులు సామాజిక ప్రయోజనం కోసం చేయవచ్చు. అలా పని చేస్తున్న రెండు కేసులు, ఆయషకు కొరుకుడు పట్టడం లేదు. శాల్ బెర్గ్ నడుపుతున్న హెడ్జ్ ఫండ్స్ లో కనుకున్న అవకతవకల వివరాలు అన్నీ ఇచ్చినా, ఎస్.ఈ.సీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అలానే మరో కేసులో తన స్నేహితురాలు అనిత వాళ్ళమ్మ లీసా మరణం, ఏక్సిడెంట్ వల్ల నేనా అని ఇద్దమిద్దంగా తేల లేదు....)*

# ‘పద పదవే వయ్యారి గాలిపటమా…’
## (మొదలు)

“లక్ష్మి నీతోనే ఉండాలనిపిస్తుంది, ఏమి చేయాలంటావు?”, అడిగాడు లారెన్స్ లేవాలని ప్రయత్నిస్తున్న లక్ష్మి నడుము పై చేయి వేసి ఆపుతూ.

“పెళ్లి చేసుకో,” అని కిసుక్కున నవ్వింది లక్ష్మి, లారెన్స్ వైపు పరుపు మీదే తిరిగి.

“నేను రెడీ నే. మరి ముందు మీ అమ్మ, నాన్నలకు పరిచయం చేయాలి కదా.”

“ముందు మా కజిన్స్ తో కలవమని చెప్పానుగా.’

“నువ్వు చెప్పిన మీ కజిన్ బ్యాచిలర్స్ పార్టీ వేగస్ లో వచ్చే నెల ఉంది. కానీ నాకు ప్రతీ క్షణం, పొద్దున ఆఫీసులో పని చేసేటప్పుడు కూడా గుర్తు వస్తూ ఉంటావు. అప్పుడు కూడా కలిసే ఉండాలనిపిస్తుంది.”

“నీ లాంటి స్కార్పియో రాసి లో పుట్టిన వారితో ఇదే తంటా. వెరీ పోస్సెసివ్. “ అంది లక్ష్మి

“అంటే నీ కిష్టం లేదా?”

“నేను పైసియన్ కదా. నాకు నువ్వలా ఉండటం మరీ ఇష్టం,” అంది లక్ష్మి లారెన్స్ ఛాతీలో తల దూర్చేస్తు.

“ఆఫీస్ లో పని చేయడం అంటే గుర్తుకు వచ్చింది. మీ జెన్ జీరో కంపెనీ మా ఎఫ్.బి.ఐ అప్రూవ్డ్ కన్సల్టెంట్స్ లిస్టు లో చేర వచ్చు కదా?”

“ చేర వచ్చు. ఒక వేళ అలా చేరి నీతో కలిసి ప్రోజెక్ట్ చేయాలనే అవకాశం వచ్చినా, మన ఇద్దరికి ఉన్న సంబంధం తెలిస్తే కాన్ఫ్లిక్ట్ అవ్వుతుందేమో కదా?

“నేను నీ బాయ్ ఫ్రెండ్ అని నువ్వు ఎఫ్.బి.ఐ కి మీ కంపెనీ అప్లై చేసినప్పుడే చెప్పేయి. అప్లికేషన్ లో ఎఫ్.బి.ఐ లో పనిచేస్తున్న రిలేషన్స్ ఎవరైనా ఉన్నారా అన్న ప్రశ్న కూడా ఉండాలి. నేను కూడా భవిష్యత్తు లో మీ కంపెనీ తో పని చేసే అవసరం వస్తే, మా మేనేజర్ కు ఆ విషయం చెప్తాను,” అన్నాడు లారెన్స్.

“మరీ ముందు కెల్లిపోతున్నావు. ముందు మా కంపనీ కన్సల్టెంట్స్ గా అప్రూవ్ అవ్వాలి కదా. అప్పుడే కలిసి పని చేసే సీన్లు ఊహించేసుకుంటున్నావు.”

“మీ కంపెనీ చేస్తున్న పనులు, సాధించిన విజయాలు నాకు తెలుసు. మీ కంపెనీని సులభంగానే అప్రూవ్ చేస్తారు.”

“నీకు తెలుసు. కానీ మేము చేసిన, చేస్తున్న పనులు చాలా మటుకు బయట ప్రపంచానికి తెలుపుకోలేనివి. పనామా పేపర్లు మా కంపనీనే బయట పెట్టింది అని చెప్పుకోలేము. అలానే మొన్న సెనేటర్ కూతురు కేసు సాల్వ్ చేశామని చెప్పాలంటే, సెనేటర్ తనే అడ్డుపడతాడు. అప్లై చేసినా అప్రూవ్ అవుతుందా?,” అంది లక్ష్మి.

“నువ్వంటున్న దానిలోనే నువ్వడిగిన ప్రశ్నకు సమాధానం ఉంది,”చిలిపిగా నవ్వుతూ అన్నాడు లారెన్స్.

“హౌ కమ్?” కళ్ళు పెద్దవి చేస్తూ అంది లక్ష్మి.

“సెనేటర్ కేసు పైకి చెప్పుకోలేవు కానీ, సెనేటర్ నీవడిగితే మీ కంపెనీకి మంచి రిఫరెన్స్ ఇస్తాడు. సెనేటర్ చెప్పాడంటే, మీ కంపెనీ అప్రూవ్డ్ లిస్ట్ లో చేరిపోయినట్లే.”

“అవును సెనేటర్ కూతురు కేసు ఆయన అడిగినట్లు గోప్యంగా ఉంచే సాల్వ్ చేసాము. ఆయన రికమెండ్ చేస్తాడనిపిస్తుంది.”

“గ్రేట్ రేపు సోమవారం ఆ అప్లికేషన్ పని మొదలుబెట్టు.”

“మరి నువ్వు ముందు లేచి నా బ్రేక్ఫాస్ట్ పని మొదలెట్టు,” లక్ష్మి, లారెన్స్ మాటలలో పడి అప్రమత్తుడై నప్పుడు చటుక్కున అతని చేయి తొలగించి లేచి, మంచం దిగి వాళ్ళు కప్పుకున్న దుప్పటి లాగి కింద పడేసింది.

“హే, హే, లక్ష్మీ…” అంటూ అరుస్తున్న లారెన్స్ మాటలు, చేతులు తప్పించుకొని లక్ష్మి, గట్టిగా నవ్వుతూ, బాత్రూం లో దూరి తలుపు వేసుకుంది.

“రిచ్ కనపడని తరువాతే ఫ్రాడ్ అయ్యిందని తెలుసుకున్నారా? లేక ఫ్రాడ్ అయ్యిందని కనుక్కున్నందు వల్ల రిచ్ మాయమయ్యాడా?” అడిగాడు లారెన్స్.

నిలకడ లేని కను చూపులు, తడబడుతున్న మాటలు, చేతలు, జీవత్సవం లేని ముఖాలు, కొన్ని సార్లు ఏ. సీ వాతావరణం లో కూడా చెమట బిందువుల సెలయేళ్ళు – ఎన్ని సార్లు చూడలేదు బిత్తర పోయిన మనుష్యులను. ఎఫ్.బి.ఐ కి పని చేస్తున్నా, కొన్ని ప్రశ్నలు వేస్తున్నా అనగానే, జనం భయపడి పోతారెందుకో – నేరం చేసినా, చేయక పోయినా. అదే డబ్బులున్న వారు, కార్పొరేట్ రంగానికి చెందిన వారు ఏకంగా తమకు లాయర్ వత్తాసు లేకుండా అసలు నోరు విప్పం అంటారు.

లారెన్స్ కు ఈ మధ్యనే ఈ కొత్త బ్యాంకు కేసు అప్పగించారు. బ్యాంక్ ట్రేడింగ్ డివిజన్ కు చెందిన అధికారి రిచ్ పనికి రావడం మానేసాడు. అతనింట్లో వాళ్ళకి కూడా, అతని ఆచూకీ తెలియలేదు. అలా మిస్సింగ్ పర్సన్ కేసు తో

మొదలైన ఈ సమస్య, రిచ్ పని చేస్తున్న డివిజన్ లోని అకౌంట్ల లో అవకతవకలు బయట పడటంతో ఎఫ్.బి.ఐ కి కేసు అప్పగించడం, ఇప్పుడు ఇలా లారెన్స్ బ్యాంక్ అధికారులను పిలిపించి ప్రశ్నలు వేయడం జరుగుతున్నది.

"రిచ్ కనపడని తరువాతే ఫ్రాడ్ జరిగి ఉండవచ్చు అని అనుమానం వచ్చింది."

ఆ జవాబు చెప్పింది బ్యాంకులో రిచ్ పని ఇప్పుడు చేస్తున్న అధికారి, జేమ్స్.

"ఆ అనుమానం ఎలా వచ్చింది?" అడిగాడు లారెన్స్.

"మా బ్యాంక్ నుండి కాంట్రాక్ట్ ప్రకారం డబ్బులు రాలేదని మరో రెండు బ్యాంకులు కంప్లైంట్ చేశాయి."

"మీ అకౌంట్లు చెక్ చేసి ఆ డబ్బు కట్టేసి ఉండ వచ్చు కదా?"

"అలా చెక్ చేయడం వల్లే ఫ్రాడ్ అయ్యిందని అనుమానించాము."

"ఎలాంటి ఫ్రాడ్?"

"డబ్బు రాలేదని కంప్లైంట్ చేసిన బ్యాంక్ లకు డబ్బు ఇది వరకే పంపించేసినట్లు మా రికార్డులలో ఉన్నాయి."

"మరి కంప్లైంట్ చేసిన బ్యాంకు దగ్గర నుంచి మీరు పంపిన డబ్బు అందినట్లు ఏమైనా రిసీట్ లు ఉన్నాయా?"

"లేవు. బ్యాంకుల మధ్య లావా దేవీలు, రిజర్వ్ బ్యాంక్ లో ఉండే బ్యాంక్ అకౌంట్ల ద్వారా జరుగుతాయి. రిజర్వ్ బ్యాంక్ అకౌంట్లు చెక్ చేశాం. కంప్లైంట్ చేసిన బ్యాంకులు చెప్తున్నది కరెక్టే. కాంట్రాక్టులు ఉన్నాయి. వాటి కి పేమెంట్ చేసినట్లు మా రికార్డ్స్ లలో ఉన్నాయి. కానీ రిజర్వ్ బ్యాంక్ ద్వారా అందాల్సిన డబ్బు ఆ బ్యాంకులకు అందజేయలేదు."

"మీ రికార్డ్స్ ప్రకారం మీరు పే చేసానన్న డబ్బు ఎక్కడికి వెళ్ళిందో తెలుసుకో వచ్చు కదా?"

"అవును, మా ఇంటర్నల్ ఆడిట్ టీమ్ అదే పని మీద ఉంది. వారు రిచ్ ఈ డిపార్మెంట్ బాధ్యతలు చేపట్టిన రోజు నుండి జరిగిన ప్రతీ ట్రేడ్ చెక్ చేస్తున్నారు. మరో రెండు రోజులలో వారి పని పూర్తి అవుతుందని అంచన. వారి రిపోర్ట్ అందిన వెంటనే మీకు ఆ కాపీ పంపిస్తాను."

లారెన్స్ కి జేమ్స్ ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఈ ఇంటర్వ్యూ ముగించేయాలని ప్రయత్నిస్తున్నాడని అర్థం అయ్యింది.

"సరే మళ్లీ కలుద్దాం, రిచ్ కింద, ఇప్పుడు మీ కింద పని చేసే వారి పేర్లు, వారు చేస్తున్న పని వివరాలు నాకు మీ డెస్క్ చేరిన తరువాత పంపించండి," అన్నాడు లారెన్స్.

లారెన్స్ కు బ్రాంచ్ నిండా సర్వేయిల్లన్స్ కెమెరాలు ఉంటాయని తెలుసు. రిచ్ ని కలిసిన వ్యక్తులను, వారి హావ భావాలను చూస్తే మరి కొన్ని విషయాలు తెలుస్తాయి అని అనిపించింది లారెన్స్ కు. బ్యాంక్ వారిని అడిగితే కెమెరా తీసిన

వీడియోలు అన్నీ క్లౌడ్ లో ఉన్నాయని. అవి చూడాలని పేపర్ వర్క్ పంపిస్తే, బ్యాంక్ ఆ వీడియోలు ఉన్న లింక్ లారెన్స్ కు పంప గలమని చెప్పారు.

రిచ్ అదృశ్యమైనట్లు, అతనిని వెదకమని మిగిలిన ఎఫ్.బి.ఐ ఫీల్డ్ ఆఫీసులకు కూడా సమాచారం పోయింది. ఎవరైనా పట్టుకుంటే తనకు వెంటనే తెలపాలి. కానీ అంతవరకు, అతను అలా అదృశ్య మవ్వడాని కారణాలు, అతని సన్నిహితుల తో మాట్లాడి కనుక్కోవచ్చు.

లక్ష్మి గొంతు ఎక్కడో," ఫాలో ది మనీ!" అని చెప్పినట్లు అనిపించింది. గతంలో లారెన్స్ చెప్పడం వల్ల లక్ష్మి ఎఫ్.బి.ఐ కి వెండర్ గా అప్లై చేసిన తరువాత మొన్నీమధ్యే, జెన్ జీరో ఇంక్ కన్సల్టెంట్ లిస్ట్ లో చేర్చారు.

లక్ష్మి కి ఫోన్ చేసాడు లారెన్స్.

"లక్ష్మి ఎలా ఉన్నావు?"

" బిజీ నే. చెప్పు వాట్స్ అప్?"

"కొత్త కేసు నాకు అప్పగించారు. మీ కంపెనీకి బ్యాండ్ విడ్త్ ఉందా. నీతో కలిసి పని చేసేందుకు సదవకాశం."

"నేను చేస్తున్న పనిని ఆయషాకు అప్పగిస్తాను లే," అంది లక్ష్మి.

"గ్రేట్. ఇప్పుడే మా వెబ్ లో వెళ్లి మీ కంపెనీ సర్వీస్ తీసుకుంటున్నానని చెప్తాను. "

"ఇంతకీ కేసు వివరాలు ఎంటి?"

"ఒక బ్యాంకర్ తప్పిపోయాడు. ఆచూకీ తెలుసుకోవాలి. మీ కంపెనీ అప్రూవ్ అయ్యిన వెంటనే నీకు ఈ కేస్ పేపర్లు అన్నీ అందుబాటులోకి వస్తాయి. చదువు. నీకు అనుమానాలు ఉంటే మళ్లీ మనం మాట్లాడుకోవచ్చు. నా దగ్గర సమాధానం లేకపోతే, డిపార్ట్మెంట్ లో మిగిలిన వారిని అడిగి కనుక్కోవచ్చు." అన్నాడు లారెన్స్.

"సరే ఆ కేసు వివరాలు, నా దగ్గరకు రానీ. చదివిన తరువాత మళ్లీ మాట్లాడుదాం," అంది లక్ష్మి.

లారెన్స్ బ్యాంక్ వాళ్ళు పంపిన రిచ్ క్లయింట్ లిస్ట్ చూడడం మొదలు బెట్టాడు. ఆ లిస్ట్ లో రిచ్ ను తరచూ కలిసే మనుష్యులు, వారి కంపనీ వివరాలు ఉన్నాయి. లారెన్స్ కు ఆ లిస్ట్ లో నుంచి పెద్దగా అనుమానించే విషయాలు ఏమీ కనపడలేదు. ఒక పది మంది తరచూ కలుస్తున్నారు. కానీ ఆ కలిసిన వారి కంపెనీలతో బ్యాంకు కు పెద్ద ఎత్తున బిజినెస్ ఉంది. కాబట్టి అదీ అనుమానాస్పదం కాదు.

తరువాత బ్యాంక్ వాళ్ళు పంపిన లింక్ ద్వారా క్లౌడ్ లో ఉన్న సర్వేయిల్లన్స్ వీడియోలు చూడడం మొదలు బెట్టాడు.

కలిసిన వారందరి ప్రవర్తన బ్యాంకులో తమ పని చేసుకొని తొందరగా వెళ్లి పోయే వారి లాగానే ఉంది. ఇవన్నీ బిజినెస్ మీటింగ్ ల లాగానే ఉన్నాయి. ఏ మాత్రం అనుమానించడానికి ఆస్కారం లేదు.

ఆలాంటి గుంపులోనుంచి ఒక తార లాగా ఒక యువతి ప్రత్యక్ష మైంది. ఈ అమ్మాయి, రిచ్ లు కలిసినప్పుడు వారి నవ్వులు, కళ్ళలో మెరుపులు మొత్తం మీద వారి బాడీ లాంగ్వేజ్ లారెన్స్ ను అప్రమత్తం చేశాయి. ఆ అమ్మాయి ఉన్న వీడియో లో మరో సారి అన్నీ చూసాడు. ఆ అమ్మాయి పని చేస్తున్న కంపనీ గవర్నమెంట్ బాండ్స్ తో వ్యాపారం చేస్తుంది. బ్యాంక్ అకౌంట్లు చూస్తే అన్నీ మామూలుగానే ఉన్నాయి. అనుమానం రావడానికి ఏమి కనపడలేదు. కానీ వీడియో లు చూస్తే, అలానే అనుకొని ముందుకు పోవాలనిపించలేదు. ఏదో అడ్డుకుంటున్నది.

ఇంతలో ఇంకో పావు గంటలో మీటింగ్ అని లారెన్స్ మానిటర్ పై, ఫోన్ పైన ఒక చిన్న శబ్దం తో అలెర్ట్ తెలిపింది. జెన్ జీరో ఇంక్ తో మీటింగ్. లక్ష్మి తమ కంపనీ గత వారంలో చేసిన పని, విశ్లేషణ మీటింగులో వివరించ బోతోంది.

లారెన్స్ తో బాటు తన మేనేజర్, మరో ఇద్దరు సబ్జెక్ట్ మ్యాటర్ ఎక్స్పర్ట్ లు మీటింగ్ కు వచ్చారు. లారెన్స్ మీటింగ్ రూం చేరగానే, లక్ష్మి అప్పటికే అక్కడ ఉంది. తన లాప్ టాప్ ను, ప్రెజెంటేషన్ కోసం, అక్కడున్న ప్రోజెక్టర్ వైర్ లకు కనెక్ట్ చేస్తూ ఉంది. లారెన్స్ లక్ష్మి కళ్ళతో కళ్ళు కలపగానే, ఇద్దరి ముఖాలలో ఒకే సారి, ఒకటే అర్థం ఉన్న చిరు నవ్వులు మెరిసి మాయమయ్యాయి.

“ఎనీ హెల్ప్?” అడిగాడు లారెన్స్.

“నో. ఏం ఫైన్. ఇది మొదటి సారి కాదు కదా, ఇలా ప్రెజెంటేషన్ ఇవ్వడం,” అంది లక్ష్మి నవ్వుతూ.

ఆ నవ్వు, దాని వెనక తన పని మీద తనకే ఉన్న నమ్మకం లక్ష్మి లో చూస్తే లారెన్స్ కు ఎప్పటికీ ముచ్చటే.

లక్ష్మి గదిలో ఉన్న వారందరికీ తనను, తన కంపెనీని పరిచయం చేసుకొని తను చేసిన విశ్లేషణ వివరాలు పంచుకోవడం మొదలెట్టింది. మధ్య, మధ్యలో తనని అడుగుతున్న ప్రశ్నలకు, విశదంగా, అందరికీ అర్థం అయ్యేటట్లు, మరిన్ని ప్రశ్నలకు తావు ఇవ్వకుండా జవాబులు చెప్తున్నది.

లక్ష్మి చెప్పిన కీలకమైన విషయాలు ఇవి. అన్ని చివరి స్లైడ్ లో సంగ్రహంగా ప్రజెంట్ చేసింది.

- రిచ్ పనిచేస్తున్న విభాగం బ్యాంక్ పేరున రెండు రంగాలలో వ్యాపారం చేస్తుంది
- ఇంటర్ బ్యాంక్ మనీ మార్కెట్లో రోజు బ్యాంక్ తమ దగ్గరున్న నిధులను బట్టి డబ్బు మిగిలిన బ్యాంకు లకు అప్పు ఇవ్వడమో, లేక అవసరమైతే అప్పు తీసుకోవడం

- ఇంటర్ బ్యాంక్ మనీ మార్కెట్లో అన్ని లావా దేవీలు, సరిగానే ఉన్నాయి. బ్యాంకు ల మధ్య జరిగిన ఒప్పొందాలకు అనుగుణంగా రిజర్వ్ బ్యాంక్ లోని బ్యాంక్ అకౌంట్లో డబ్బు జమ అవ్వడము, తీసి వేయడం జరిగింది.
- రెండవది, ప్రభుత్వపు బాండ్, బిల్స్ మార్కెట్ లో తమ దగ్గరున్న సెక్యూరిటీల ను అమ్మ డమో, కొనడమో చేయడం. వీటిని ట్రెజరీ బాండ్స్, బిల్స్ అని, ప్రభుత్వ సెక్యూరిటీలు అని కూడా అంటారు.
- ఈ లావాదేవీల లెక్కలు సరిగా తేలడం లేదు. రిజర్వ్ బ్యాంక్ లో సమయానికి డబ్బులు కట్టి నట్లు లేదు. అలానే బ్యాంక్ లకు వారు కొన్న సెక్యూరిటీ లు రిజర్వ్ బ్యాంక్ నుంచి సమయానికి అందలేదు.

లక్ష్మి ఈ సెక్యూరిటీ వ్యాపార లావా దేవీల మీద మరికొంత పరిశోధన చేయాలన్నది. లారెన్స్ కి రిచ్ ను కలుస్తున్న అమ్మాయి గుర్తుకు వచ్చింది. తను రిచ్ దగ్గరకు పోయి పనిచేస్తున్నది ఈ ప్రభుత్వ సెక్యూరిటీ ల వ్యాపారం మీదే.

"లక్ష్మి, నేను బ్రాంచ్ నుంచి సేకరించిన కొత్త సమాచారం కూడా రిచ్ చేస్తున్న ప్రభుత్వ సెక్యూరిటీల వ్యాపారంలో గల్లంతులుండ వచ్చు నని చెప్తున్నాయి. నీవు చూసిన ప్రత్యేక క్లైంట్స్ లలో, ఎవరి మీద నైన అనుమానాలు ఉన్నాయా?" అడిగాడు లారెన్స్.

"గ్రేట్ బుల్ ట్రెజరీ ట్రేడర్స్ చేస్తున్న వ్యాపారం మిగిలిన వారికి భిన్నంగా ఉంది."

"రిచ్ ప్రతీ రోజు ఎక్కువ మొత్తాలలో ట్రేడ్ చేసేది ఈ కంపెనీ తోనే."

"అందులో ఆశ్చర్య మేముంది. గ్రేట్ బుల్ కంపనీ ఈ వ్యాపారంలో ముందు ఉండవచ్చు కదా?" అన్నాడు లారెన్స్ మానేజర్.

"ఈ కంపెనీ కొత్తదే. ఈ కంపెనీ అకౌంట్ బ్యాంకులో తెరచి సంవత్సరం కూడా కాలేదు. మొదట్లో వేలతో ప్రారంభించిన ట్రేడ్స్ ఇప్పుడు మిలియన్ లలో నడుస్తున్నది," అంది లక్ష్మి.

"వ్యాపారం అలా అంత తొందరలోనే పెరగడం, ఆ కంపెనీకి, బ్యాంక్ కు ఇద్దరికీ లాభమే కదా?" మళ్లీ అడిగాడు లారెన్స్ మేనేజర్.

"ఇలా ఇంత తొందరగా పెరగడం ఒక రెడ్ ఫ్లాగ్ కూడా," అన్నాడు లారెన్స్.

"బ్యాంక్ లు సెక్యూరిటీలు కొనడం లో ఆశ్చర్యం లేదు కదా. బ్యాంక్ డిపాజిట్ లో పెరిగే కొద్దీ, రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలకు మేర ఆ డిపాజిట్ లో కొంత శాతం సెక్యూరిటీల లో ఉంచాలి. మొత్తం డబ్బు అప్పులుగా పంచేయ లేరు," మీటింగ్ లో ఉన్న మరో సబ్జెక్ట్ మ్యాటర్ ఎక్స్పర్ట్ అన్నాడు.

"అవును. అది కరెక్టే. కానీ ప్రతీ రోజు పొద్దున్నే ఎందుకు ఇలా కొంటున్నారు అని బ్యాంక్ ను మరిన్ని వివరాలు అడిగాను. గ్రేట్ బుల్ కంపనీ తమ పనులు తొందరగా కావడానికోసం ఈ సెక్యూరిటీ లు అమ్మే ఇతర బ్యాంక్ లనుండి ఒక హామీ పత్రం తేగలుగుతున్నది. మరో బ్యాంక్ హామీ పత్రం కాబట్టి, రిచ్ ఆ పత్రం తీసుకొని తన బ్యాంక్ చెక్ గ్రేట్ బుల్ కంపెనీకి ఇచ్చేవాడు," అంది లక్ష్మి.

"బ్యాంక్ చెక్ అంటే గ్రేట్ బుల్ కంపెనీకి వెంటనే డబ్బులు అందే వన్న మాట."

"అవును ఆ చెక్ ఇమేజ్ వారు బ్యాంక్ కు పంపించి, గ్రేట్ బుల్ కంపనీ వెంటనే డబ్బు రిచ్ బ్యాంక్ నుంచి తమ అకౌంట్లలోకి మార్చుకొనే వారు."

"మరి రిచ్ బ్యాంక్ కొన్న సెక్యూరిటీల సంగతీ?" అడిగాడు లారెన్స్.

"అవి రిజర్వ్ బ్యాంక్ ట్రెజరీ డిపార్ట్మెంట్ వాళ్ళు బ్యాంక్ అకౌంట్లో జమ చేయాలి. చెక్ డబ్బులు అందిన తరువాత, గ్రేట్ బుల్ కంపనీ వాళ్ళు, సెక్యూరిటీల అమ్ముతామని హామీ ఇచ్చిన బ్యాంక్ వాళ్ళ దగ్గరకువెళ్లి, వారు రిచ్ వాళ్ళ బ్యాంక్ కు, రిజర్వ్ బ్యాంక్ ద్వారా సెక్యూరిటీలు తమ అకౌంట్ లో నుంచి మార్పించారు అని నిర్ధారణ చేసిన తరువాత ఆ బ్యాంక్ కు ఆ సెక్యూరిటీ లు అమ్మినదానికి డబ్బు ఇచ్చే వారు," అంది లక్ష్మి.

"అంటే ఇలా అమ్మడం, కొనడం తో వారు కొంత కమిషన్ సంపాదించే వారన్న మాట," అన్నాడు మరో సబ్జెక్ట్ మ్యాటర్ ఎక్స్పర్ట్.

"మిలియన్ లలో వ్యాపారం కాబట్టి, కొంత ఏమిటి, బాగానే డబ్బు సంపాదించారు ఈ గ్రేట్ బుల్ కంపనీ వారు."

"అంటే కొత్త కంపనీ అని, అంత త్వరలోనే ఇంత సంపాదించ గలిగింది అని నీ అనుమానమా? మార్కెట్ లో కొత్తగా ప్రవేశించి, మార్కెట్ ను చిందర వందర చేసే డిస్రప్టర్ కంపనీల గురించి ఇదివరకే కేస్ స్టడీస్ ఉన్నాయి కదా. మరి గ్రేట్ బుల్ అలాంటి కంపనీనేననుకోవచ్చు కదా," లారెన్స్ బాస్, ఈ సారి మాట్లాడాడు.

"అలాంటి బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇద్దామనే, వీరు చేస్తున్న వ్యాపారం ఇది వరకే ఇతర కంపెనీలు చేస్తున్న వ్యాపారంతో పోల్చి చూసాను. మరిన్ని రెడ్ ఫ్లాగ్స్, అనుమానాలు తోడయ్యాయి. బ్యాంక్ వారి బ్యాక్ ఆఫీస్ లో ఈ సెక్యూరిటీల అకౌంట్లు ఎలా నడుపుతున్నారు అని ప్రస్తుతం చెక్ చేస్తున్నాను. మరో రెండు రోజులలో నేను నా విశ్లేషణ పంచుకోగలను," అంది లక్ష్మి.

మరో రెండు రోజుల తరువాత, అదే సమయంలో కలుద్దామని నిర్ణయించిన తరువాత ఆ మీటింగ్ ముగిసి పోయింది.

లక్ష్మి తన లాప్ టాప్ షోల్డర్ బ్యాగ్ లో పెట్టుకొని, జెన్ జీరో ఆఫీస్ కు పోవడానికి రెడీ అవ్వు తుంటే, లారెన్స్ కూడా లక్ష్మితో పాటు, ఆ రూము లో నిలిచి పోయాడు. మిగిలిన వారు అప్పటికే వారి పని తొందర వల్ల ఆ కాన్ఫరెన్స్ రూం నుండి, వారి డెస్క్ లకు  వెళ్లి పోయారు.

"లక్ష్మి టైం ఉందా? గ్రేట్ బుల్ ఆఫీస్ కు పోవాలి. దగ్గరే స్టార్ బక్స్  ఉంది.  కాఫీ కి వస్తావా? అక్కడి నుంచి నేను గ్రేట్ బుల్ కు, నువ్వు నీ ఆఫీస్ కు పోవచ్చు," అన్నాడు లారెన్స్.

"గ్రేట్ బుల్ కు ఎందుకు?"

"ఇందాక నువ్వు గ్రేట్ బుల్ తో పొద్దునే రిచ్ మొదటి ట్రేడ్ చేసే వాడు అని చెప్పావు కదా? నేను ఆ బ్యాంక్ సర్వేయిల్లన్స్ వీడియో లు చూసిన తరువాత ఒక యువతి తరచూ రిచ్ ను కలవడం చూసాను. ఆవిడ గ్రేట్ బుల్ కంపనీ కి పని చేస్తుంది. ఈ రోజు నీ ప్రెజెంటేషన్ లో కూడా ఆ కంపెనీ పై అనుమానాలు వ్యక్త పరచడం వల్ల, నాకు ఆవిడని వెంటనే కలవాలనిపించింది."

"కాఫీ కి 'నో' అని కొంత సేపు నిన్ను టీజ్ చేసి, తరువాత 'సరే' అందామనుకున్న. కానీ గ్రేట్ బుల్ ప్రసక్తి తెచ్చావు. నన్నూ నీతో బాటు ఆ కంపెనీకి తీసుకెళ్ళు, కాఫీ కి వస్తాను."

"దానికేముంది, రా. నీ 'నో' ఎప్పుడు 'ఎస్' అనే అర్థం తో అంటున్నావో నాకు బాగా తెలుసు," నవ్వుతూ లక్ష్మి భుజం  సరదాగా తట్టాడు లారెన్స్.

"నా కారు లోనే పోదాం పద. కబుర్లు చెప్పుకోవచ్చు. తిరిగి నా ఆఫీసు కు పోవాలంటే నీ ఆఫీసు మీదుగానే వెళ్ళాలి. నిన్ను డ్రాప్ చేసి వెళ్తాను."

లక్ష్మి దారిలో స్టార్ బక్స్ కాఫీ షాప్ డ్రైవ్ తృ లోకి వెళ్లి ఇద్దరికి కాఫీ ఆర్డర్ చేసింది. కిటికీలోంచి రెండు కాఫీ కప్పులు తీసుకొని, లారెన్స్ కు చల్లగున్న కప్పు అందించింది. తనకి నైట్రో బ్రు చల్లటి కాఫీ ఇష్టం

"ఎంత వరకు వచ్చాయి మా కజిన్ బ్యాచిలర్ పార్టీ ఏర్పాట్లు," అడిగింది లక్ష్మి.

లక్ష్మి వాళ్ళ తల్లి తండ్రులను కలిసే ముందు, తన కజిన్స్ కలవ మనడం లారెన్స్ కు కొంత వింతగా అనిపించినా, లక్ష్మి కోసం ఒప్పుకున్నాడు. బహుశా పరిచయం తో పాటు తను ఎంజాయ్ చేయాలని అలా చేసిందేమో.

"ఈ పార్టీ ఏర్పాటు చేస్తున్న మీ కజిన్స్ నన్ను వాళ్ళ చాట్ గ్రూప్ లో చేర్చారు. నిమిష, నిమిషానికి ప్లాన్ వేసి పంపారు," నవ్వుతూ అన్నాడు లారెన్స్ కాఫీ సిప్ చేస్తూ.

"ఏమేం చేస్తున్నారేమిటి?" అడిగింది లక్ష్మి చిలిపిగా చూస్తూ.

"నీకు తెలియకుండ ఉండడమే మేలు."

"అంత సీక్రెట్స్, ఏంటో?"

"ముందు మీ కజిన్స్ మెప్పు పొందాలి కదా. నీకు చెప్పేస్తే వారు ఊరుకోరు," టీజ్ చేస్తూ అన్నాడు లారెన్స్.

అలా వాళ్ళు చలోక్తులు విసురుకుంటూ, కాఫీ లు తాగడం ముగించే సరికి, రిచ్ ను తరచూ కలుస్తున్న యువతి పని చేసే గ్రేట్ బుల్ ఆఫీస్ వచ్చేసింది.

కార్ పార్క్ చేసి, లక్ష్మి, లారెన్స్ ఇద్దరూ రిసెప్షన్ దగ్గరికి వెళ్లారు. తాము కలవాలనుకున్న యువతి పేరు రతి అని జేమ్స్ ద్వారా తెలుసుకున్నాడు, లారెన్స్

లారెన్స్ " మీ కంపెనీలో పని చేస్తున్న రతిని కలవాలి," అని చెప్పాడు.

దానికి రిసెప్షనిస్ట్," రతి ఆఫీసు కు రాలేదండి," అంది.

"తను ఎవరికి రిపోర్ట్ చేస్తుంది? తన డిపార్ట్మెంట్ వాళ్ళు ఎవరైనా ఉన్నారా?" అడిగాడు లారెన్స్.

"తన బాస్ ఉన్నారు. మాట్లాడతారా?" అంటూ ఆ రిసెప్షనిస్ట్ వారిని గ్లాస్ డోర్ తెరచి వారికి లోపలికి దారి చూపింది. లోపల ఒక పెద్ద హాల్ ఉంది. కొన్ని వర్క్ స్టేషన్ లు ఉన్నాయి. కానీ, పని చేసే వారెవరూ కనపడలేదు. గ్లాస్ డోర్స్ ఉన్న క్యుబికల్స్ రెండు హాల్ చివర కనిపించాయి. ఒక దాని మీద 'రతి' అని ఆ యువతి పేరు ఉంది. అది రిసెప్షనిస్ట్ అన్నట్లే ఖాళీగా ఉంది. పక్కనున్న పెద్ద క్యూబికల్ లో ముప్పై లలో ఉన్న ఒకతను బిజినెస్ క్యాసువల్స్ లో ఉన్నాడు. క్యుబికల్ మీద 'జోషీ' అన్న పేరు ఉంది.

"హల్లో జోషీ, నా పేరు లారెన్స్. తను లక్ష్మి, మాకు సహాయ పడుతున్న కన్సల్టెంట్, " అంటూ తన విజిటింగ్ కార్డ్ ఇచ్చాడు లారెన్స్.

అంత వరకు ముఖంలో ఉన్న నవ్వు, కార్డ్ చదివిన వెంటనే మాయం అయ్యింది. లారెన్స్ కి అది చూడటం అలవాటు అయిపోయింది.

" నైస్ మీటింగ్ యు. నేనేమీ చేయ గలుగు తాను?," గొంతులోని త్రొట్టు బాటు కప్పడానికి చేస్తున్న ప్రయత్నం లారెన్స్ పసి కట్టేసాడు.

"కొత్త ఆఫీస్ లాగా ఉంది. మిగిలిన ఉద్యోగులు ఎక్కడ?" అడిగాడు లారెన్స్.

"ఇప్పటికీ ముగ్గురే ఉన్నాము ఈ ఆఫీస్ లో. రిసెప్షనిస్ట్ ను ఇది వరకే కలిశారు. నన్ను కలిశారు. ఇక మిగిలినది రతి నే. ఆవిడ రాలేదు. ఇక ఆఫీస్ స్పేస్ ఈ మధ్యనే లీజ్ కు తీసుకున్నాము. ఇంకా ఉద్యోగులను రిక్రూట్ చేయాలి," అన్నాడు.

"మరి మీరు చేస్తున్న మొత్తం సెక్యూరిటీ బిజినెస్, మీరిద్దరే చేయ గలుగుతున్నారా? "

"అవును. రతి కి ఈ బిజినెస్ లో మంచి అనుభవం ఉంది. ప్రస్తుతం ఆవిడే అన్ని పనులు చూసుకో గలుగు తున్నది."

"మరి ఆవిడ లేదంటున్నారు.మాకు ఆవిడతో పని ఉంది. రేపు వస్తుందా?"

"తెలీదండి. వారం రోజుల నుండి రావటం లేదు. గత వారం అర్జెంట్ పని, అమ్మా, నాన్నల దగ్గరికి వెళ్తున్నానని మెసేజ్ పంపింది. ఎప్పుడు తిరిగి వస్తుందో తెలియదు. ఇవ్వాళ ఫోన్ కూడా చేసాను. రెస్పాన్స్ లేదు. "

"అన్నట్టు మీకు మీ బ్యాంకర్ రిచ్ తెలుసా? రతి అతని దగ్గరకు ప్రతీ రోజు వెళ్ళేది."

"రిచ్ దగ్గరనే కాదు. మాకు ఒక పది బ్యాంక్ లలో అకౌంట్లు ఉన్నాయి. అందరినీ రతి అవసరం బట్టి కలవడానికి పోతుంది. కలిసి మాట్లాడితే నే మన

పనులు తొందరగా అవుతాయి మా కంపనీ నమ్మకం," అన్నాడు జోషీ.

"జోషీ, మీకు రతి బ్యాంక్ లతో చేస్తున్న డీల్స్ గురించి తెలుసా?" అడిగాడు లారెన్స్.

"రతి కే తెలుసండి. ఆవిడ వచ్చిన తరువాత నేనే మీకు ఫోన్ చేస్తాను," అన్నాడు జోషీ. అతని మాటలు పరుగు తీస్తున్నట్లు బయటకు వచ్చాయి.

ఇంకా చేసేదేమీ లేదని లారెన్స్ కి అర్థం అయిపోయింది. జోషీ దగ్గర వీడ్కోలు తీసుకొని లక్ష్మితో బాటు, లారెన్స్ బయట పడ్డాడు.

"ఏమనుకుంటున్నావు?" లక్ష్మి ని ఉద్దేశించి అడిగాడు లారెన్స్.

"నువ్వు ఫీల్డ్ లో కూడా వెళ్ళి నీ పరిశోధన చేసుకోవచ్చు. నాకా సౌకర్యం లేదు. కొంత ఈర్ష గా ఉంది. నా పరిశోధన అకౌంట్లు, సంఖ్యలు, కంప్యూటర్ సెక్యూరిటీ లకు పరిమితం కాబట్టి, నేను ఇంత వరకు కనుగొన్న లోటుపాట్లు, చేయవలసిన తరువాతి పనులు చెప్తాను"

"చెప్పు. ఈర్ష పడాల్సిన దేమి లేదు. నీవు ఇదివరకే పెద్ద పెద్ద నేరాలు, నువున్న ఆఫీస్ గది కదలకుండా సాల్వ్ చేసావు. అది చూస్తే నాకు నువ్వు చేస్తున్న పని మీద ముచ్చటే. ఫీల్డ్ లో నా సహాయం ఏమైనా కావాలంటే కూడా చెప్పు."

"నీ సహాయం కావాల్సిందే. నాకు రిచ్ వాళ్ళ బ్యాంక్ చేస్తున్న లావా దేవీలు తెలుసు. కానీ గ్రేట్ బుల్ కంపనీ వివరాలు కూడా కావాలి. ఆ కంపనీ ఇంకా, ఎవరెవరితో వ్యాపారం చేస్తున్నదో, ఆ వివరాలు కూడా కావాలి "

లారెన్స్ ఒక నిమిషం ఆలోచించి, " గ్రేట్ బుల్ వివరాలు జోషీ కి ఫోన్ చేసి అడుతాను. ఇవ్వనంటే కోర్టు ద్వారా సపీన పంపించి, ఆ వివరాలు తెప్పించి నీకు ఇస్తాను. ఇక పోతే రతి ఫోన్ లొకేషన్ రికార్డ్స్ ట్రాక్ చేస్తే, తను తిరిగిన బ్యాంక్ ల వివరాలు కూడా తెలుస్తాయి. అలానే తను మిస్సింగ్ కాబట్టి తను ఇప్పుడు ఎక్కడుందో తెలుసుకొని, ఆవిడను కలువవచ్చు" అన్నాడు.

"పెర్ఫెక్ట్. అది నాకు సరిపోతుంది."

“రతి సంగతి సరే కానీ, మీ అమ్మా, నాన్న లను మనం కలవడానికి ప్లాన్ చేసావా. లేకపోతే, ఏదో కేసు మీద మాట్లాడాలని, నువ్వు మీ అమ్మా, నాన్నలతో ఉన్నపుడు, మీ ఇంట్లో దిగేస్తాను,” లారెన్స్ లక్ష్మి ను టీజ్ చేశాడు.

“నువ్వన్నంత పని చేస్తావు. చెప్పాను కదా, మళ్లీ, మళ్లీ అక్కడికే వస్తావు. మా కజిన్ లను ఆ బ్యాచిలర్ పార్టీ లో కలిసిన తరువాత, కలుద్దాం. వాళ్ల సర్టిఫికెట్ కూడా పనికి వస్తుంది కదా.”

“అంటే మీ కజిన్స్ తో జాగ్రత్తగా మసలు కోవాలన్న మాట.”

“అవును. నీ గురించి పెద్దగా ఏమీ చెప్పలేదు. కాబట్టి వాళ్ళను ఇంప్రెస్ చేయాలంటే కొంచెం కష్ట పడాల్సిందే.”

“నీ వెంట బడి, నిన్ను ఒప్పించడం కూడా అంత సులభం కాదు కదా. ఆ పని చేసేసా. ఈ పని చేస్తాను,” లారెన్స్ నవ్వేసాడు.

లారెన్స్ ఆఫీస్ చేరాక, రిచ్ పని చేస్తున్న బ్యాంక్ కు ఫోన్ చేసాడు. రిచ్ స్థానంలో పని చేస్తున్న జేమ్స్ ఫోన్ ఎత్తుకున్నాడు.

“జేమ్స్ ఎలా ఉన్నావు. నేను లారెన్స్, నాకు గ్రేట్ బుల్ దగ్గరి నుంచి నీ బ్యాంక్ కు వచ్చే రతి మొబైల్ ఫోన్ నంబర్ కావాలి. నువ్వు ఇదివరకు ఇచ్చిన లిస్ట్ లో ఆఫీస్ నంబర్ మాత్రమే ఉంది.”

“తప్పకుండా. ఆ అకౌంట్ చూస్తాను. కాంటాక్ట్ లిస్ట్ లో రతి వివరాలు ఉండాలి,” అని వెదికి రతి ఫోన్ నంబర్ లారెన్స్ కి చెప్పాడు.

“థాంక్స్ జేమ్స్. నీకు ఈ గ్రేట్ బుల్ కంపెనీకి ఇంకా ఏవైనా వేరే బ్యాంక్ లలో కూడా అకౌంట్లు ఉన్నాయేమో తెలుసా? అలా తెలిస్తే నేను మిగిలిన బ్యాంక్ వాళ్ళను కూడా కలవచ్చు”

“ గ్రేట్ బుల్ కంపనీ మాకు ఇచ్చిన ఇతర బ్యాంక్ రసీదులు, కాంట్రాక్ట్ కాగితాలు బట్టి ఆ బ్యాంకుల వివరాలు ఇవ్వగలను. కానీ మొత్త లిస్ట్ కావాలంటే, ఆ విషయం మీరు గ్రేట్ బుల్ కంపెనీనే అడగండి. అన్నట్లు, ఈ నెల బ్యాంకర్స్ అసోసియేషన్ వాళ్ళు మానెక్ భాయి ని ముఖ్య అతిధి గా పిలిచారు. మీరు ఆ కాన్ఫరెన్స్ కు వస్తే, మీరు నగరంలోని బ్యాంకర్ లను కలవచ్చు. ఈ మీటింగ్లకి బ్యాంకర్లతో పాటు ప్రముఖ వ్యాపారస్తులు కూడా వస్తారు.”

“మానెక్ భాయి అన్నావు. అతని గురించి చాలా విన్నాను, ఈ మధ్య న్యూస్ లో కూడా తరచూ వస్తున్నాడు. స్టాక్ మార్కెట్ ను ఓ కుదుపు కుదేస్తున్నాడని ప్రతీ రోజు వింటున్నాను. మీటింగ్ కు బ్యాంకర్లు వస్తారన్నావు కాబట్టి తప్పక వస్తాను. ఆ మీటింగ్ కు రావాలంటే ఇన్విటేషన్ ఉండాలి కదా.”

“మీరొస్తారంటే చెప్పండి. నేను అర్.ఎస్.వీ.పీ చేసేటప్పుడు మిమ్మల్ని నా గెస్ట్ గా కలుపుతాను. ఆ ఇన్వైట్ కూడా మీకు పంపిస్తాను.”

“థాంక్స్. ఇన్వైట్ పంపించండి,” అని లారెన్స్ ఫోన్ పెట్టేసాడు.

లారెన్స్ రతి ఫోన్ లొకేషన్స్ తెలుసుకోవడానికి, కావలసిన అనుమతులు తీసుకొని, ఫోన్ కంపెనీకి మెయిల్ పంపించాడు. అదో రొటీన్ పనినే. రెండు రోజులలో రతి ఫోన్ లొకేషన్స్ అన్నీ వచ్చేశాయి. రతి రిచ్ చేస్తున్న బ్యాంక్ కాక, ఇంకా ఎవరి దగ్గర పోయిందో చూసాడు. దాదాపు నగరం లో ఉన్న పెద్ద పెద్ద బ్యాంక్ బ్రాంచి లన్నిటిని బొంగరం లా తిరిగేసింది. అందులో ఒక ఐదు బ్యాంకులు ప్రతీ రోజు తిరిగేది. అందులో మూడు బ్యాంకులు విదేశీ బ్యాంకులు.

ఆశ్చర్యంగా, గత వారం తరువాత రతి ఈ ఫోన్ ఉపయోగించిన దాఖలాలు లేవు. అంటే రతి తను తిరుగుతున్న ప్రదేశాల వివరాలు కప్పిపుచ్చడానికి తన ఫోన్ మార్చేసిందా?

లక్ష్మి కి ఫోన్ చేసాడు.

“లక్ష్మి, రతి తిరిగిన బ్యాంక్ బ్రాంచ్ వివరాలు పంపించాను. చూసావా?”

“ఎస్, ఇప్పుడే నీ ఉత్తరం, నువ్వు పంపిన వివరాలు చూస్తున్నాను. నీవు పంపిన గ్రేట్ బుల్ అకౌంట్లు కూడా చూస్తున్నాను.”

“గ్రేట్. జోషీ వెంటనే ఇవ్వలేదు. కానీ సపీన అందజేసిన తరువాత, గత్యంతరం లేక ఇవ్వాల్సి వచ్చింది. సరే నువ్వు నీ పరిశోధన తరువాత ఫోన్ చేయి,” అన్నాడు లారెన్స్.

Post your comments